

ESTD : 1999

# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY

ఉమ్మడి కరీంనగర్ జిల్లా

గురువారం 25 జూన్ 2026 పేజీలు : 8


## బాలమిత్ర పాఠశాలలో చిన్నారి మృతి

ముస్తాబాద్,జూన్ 24(విజన్ ఆంధ్ర)

ముస్తాబాద్ మండలంలోని బాలమిత్ర పాఠశాలలో నర్సరీ విద్యార్థిని ఈజ మెహరిన్ (4) మృతి చెందడం తీవ్ర విషాదాన్ని కలిగించింది. ఘటనకు సంబంధించిన సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితులను పరిశీలించారు. ఈ క్రమంలో చిన్నారి కుటుంబ సభ్యులు, పాఠశాల యాజమాన్యం నుంచి వివరాలు సేకరిస్తున్నారు.మృతికి గల కారణాలపై అధికారికంగా ఎలాంటి ప్రకటన వెలువడలేదని, విచారణ



పూర్తయిన అనంతరం పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది.చిన్నారి మృతి వార్తతో కుటుంబ సభ్యులు, బంధువులు, స్థానికులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఈ ఘటన ముస్తాబాద్ మండలంలో విషాద ఛాయలు నింపింది



## కరీంనగర్ జిల్లాను ప్రభుత్వ పథకాల అమలులో అగ్రభాగాన నిలపండి

మానవీయ కోణంలో ప్రజల సమస్యలు పరిష్కరించండి

నిత్యం ప్రజలతో మమేకం కావాలి..

అర్హులైన వారందరికీ వివిద అభివృద్ది , సంక్షేమ పథకాలు అందించాలి..

ప్రజలకు సేవ చేయడం అధికారుల అదృష్టంగా భావించాలి

సమస్యలను గుర్తించడం, పరిష్కరించడం నిరంతర ప్రక్రియగా కోన సాగాలి..

3లో

### మెట్‌పల్లిలో ప్రైవేట్ ఆస్పత్రి

# ఆగడాలు బట్టబయలు

**విజన్ ఆంధ్ర స్టింగ్ ఆపరేషన్‌లో సంచలన నిజాలు.. ప్రైవేట్ ఆస్పత్రి అక్రమాల గుట్టు విప్పిన స్టింగ్ ఆపరేషన్**

మెట్‌పల్లి, జూన్ 24 (విజన్ ఆంధ్ర): మెట్‌పల్లి పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి సంబంధించిన పలు సంచలన విషయాలు విజన్ ఆంధ్ర నిర్వహించిన స్టింగ్ ఆపరేషన్‌లో వెలుగులోకి .... ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించాల్సిన వైద్య వృత్తిలో ఉన్న వ్యక్తులే నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.స్థానికంగా అందుతున్న సమాచారం ప్రకారం, సంబంధిత ఆస్పత్రి నిర్వాహకుడు లేకపోయినా ఆయన స్థానంలో మరొక వ్యక్తి వైద్య సేవలు అందిస్తున్నాడనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరి ఆ వ్యక్తి నిజమయిన వైద్యుడా కాదా అనే అనుమానాలు రోగులు వ్యక్తం చేస్తున్నారు.చెడు అలవాట్లు మానుకోవాలని రోగులకు సూచించాల్సిన వైద్యులే రూల్స్ కి విరుద్ధంగా ఆస్పత్రి కార్యకలాపాలు నిర్వహిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.అలాగే, గతంలో




మరో ఆస్పత్రిలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేసిన వ్యక్తి ప్రస్తుతం సొంత పేరుతో ఆస్పత్రి నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే సంబంధిత ఆస్పత్రిలో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బంది అర్హత పత్రాలపై, అనుమతులకు సంబంధించిన పత్రాలపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రోజుకు 30 నుంచి 50 మంది వరకు ఓపీ రోగులను పరీక్షిస్తున్నప్పటికీ, ఆస్పత్రి నిర్వహణలో నిబంధనల ఉల్లంఘనలు ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంబంధించిన ప్రముఖ రాజకీయ నాయకుల అండదండలతో జిల్లా వైద్య విధాన పరిషత్ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఐఎంఏ నాయకుల అండదండతో కొనసాగుతున్నట్టు జోరుగా ప్రచారం జరుగుతోంది.ఈ వ్యవహారానికి సంబంధించిన పూర్తి వివరాలు, స్టింగ్ ఆపరేషన్‌లో సేకరించిన ఆధారాలు, సంబంధిత అధికారుల స్పందనతో కూడిన ప్రత్యేక కథనం త్వరలో.

-----------

# ఫీజుల వేట

### వసతుల కోత ప్రైవేట్ విద్య అసలు బాట

చదువుల 'అంగడి' మధ్యతరగతికి అందని ద్రాక్ష

అడ్మిషన్ల పేరిట...అడ్డగోలు దోపిడీ

మల్యాల, జూన్ 24 (విజన్ ఆంధ్ర): జగిత్యాల జిల్లా మల్యాల మండలంలో మారిన కాలంతో పాటు విద్య వ్యాపారంగా మారిపోయింది. ఒకప్పుడు జ్ఞానాన్ని పంచే దేవాలయాలుగా వెలిగిన విద్యాసంస్థలు, నేడు కాసులు

2లో




### విద్యారంగంలో సమూల మార్పులకు

# ప్రభుత్వం కృషి

వేములవాడలో ఆల్ఫోర్స్ నూతన పాఠశాల ప్రారంభం

ప్రభుత్వ విద్య బలోపేతానికి కీలక చర్యలు

విద్యార్థులకు నాణ్యమైన విద్యే లక్ష్యం

విప్ ఆది శ్రీనివాస్




2లో



## సర్ కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి నాయకురాలు శ్రావణి

జగిత్యాల ఆర్ సి జూన్ 24(విజన్ ఆంధ్ర )

జగిత్యాల నియోజకవర్గం ప్రత్యేక సమగ్ర సవరణ ఓటరు జాబితా--2026 (ూ×=) కార్యక్రమంలో భాగంగా, జగిత్యాల్ పట్టణంలోని ఎఖదీ ఫంక్షన్ హాల్ నిర్వహించిన జగిత్యాల నియోజకవర్గం (ూ×=) కార్యాశాల కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బిజెపి జగిత్యాల్ నియోజకవర్గం ఇంచార్జ్ ఐతీ. బోగ శ్రావణి ప్రత్యేక సమగ్ర సవరణ ఓటరు జాబితా కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో బూత్ లెవెల్ ఏజెంట్లు (దీూా 2) కీలక పాత్ర పోషించాలి. ప్రతి అర్హుడైన ఓటరు పేరు జాబితాలో నమోదయ్యేలా పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పనిచేయాలి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు, జిల్లా పదాధికారులు, మండల పదాధికారులు, కౌన్సిలర్లు, వివిధ మోర్చాల నాయకులు, బూత్ లెవెల్ ఏజెంట్లు, శక్తికేంద్ర మరియు బూత్ స్థాయి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నరు.

-------

## మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాలతో రోడ్డు పనులు ప్రారంభం



రామగిరి జూన్ఈ 24( విజన్ ఆంధ్ర )

ఈ రోజు రామగిరి మండలం బుధవారంపేట గ్రామ పంచాయతీ పరిధిలోనీ శంకేశిపల్లె వద్ద జజ రోడ్డు పనులు గ్రామ సర్పంచ్ కన్నూరి రవీందర్,పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఐజజ కార్యదర్శి బుద్దార్థి బుచ్చన్న పటేల్ ప్రారంభించారు.. ఇట్టి జజ రోడ్డు నిర్మాణం వలన గ్రామ ప్రజలకు రవాణా సౌకర్యం సులభం అవ్వటంతో పాటు ముఖ్యంగా వర్ష కాలంలో రవాణా సౌకర్యం మెరుగుపడి ప్రజలకు ఎంతో ఉపయోగకారంగా ఉంటుంది.. ఈ సందర్భంగా సర్పంచ్ కన్నూరి రవీందర్ మరియు ఐజజ కార్యదర్శి బుద్ధార్థి బుచ్చన్న పటేల్ మాట్లాడుతూ మంత్రి దుద్దిల శ్రీధర్ బాబు సహకారంతో గ్రామ అభివృద్ధికి అవసరం అయిన మరిన్ని పనులు చేపట్టి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బుధవారం పేట ఉప సర్పంచ్ బుద్దార్తి విజయ ,ూవీజ డైరెక్టర్ ఆరేల్లి శ్రీనివాస్,వార్డ్ సభ్యులు కన్నూరి రాకేష్, కన్నూరి శ్రావణ్, బావు స్వరూప కత్తెరసాల,మరుకు చంద్రశేఖర్, శీలం హర్షిత రాము, గ్రామ పంచాయతీ కార్యదర్శి చొప్పరి రాకేష్, కారోబర్ సతీష్ మరియు గ్రామస్థులు పాల్గొన్నారు...

------

# ఫీజుల వేట..వసతుల కోత ప్రైవేట్ విద్య అసలు బాట



### చదువుల 'అంగడి' మధ్యతరగతికి అందని ద్రాక్ష
### అడ్మిషన్ల పేరిట...అడ్డగోలు దోపిడీ

మల్యాల, జూన్ 24 (విజన్ ఆంధ్ర):

జగిత్యాల జిల్లా మల్యాల మండలంలో మారిన కాలంతో పాటు విద్య వ్యాపారంగా మారిపోయింది. ఒకప్పుడు జ్ఞానాన్ని పంచే దేవాలయాలుగా వెలిగిన విద్యాసంస్థలు, నేడు కాసులు కురిపించే కార్పొరేట్ సామ్రాజ్యాలుగా రూపాంతరం చెందాయి. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీ నానాటికీ మితిమీరిపోతోంది. లీకేజీలు లేని నాణ్యమైన విద్య, ర్యాంకులు, ఏసీ క్లాస్ రూములు, ఇంటర్నేషనల్ సిలబస్ అంటూ రంగురంగుల బ్రోచర్లు చూపిస్తూ మధ్యతరగతి, పేద తల్లిదండ్రుల రక్తాన్ని జలగల్లా పిల్చేస్తున్నాయి. కొన్ని కార్పొరేట్, ప్రయివేట్ యాజమాన్యాలు.?ఆకాశాన్నంటుతున్న ఫీజులు.. అదనపు బాదుడు కిలోమీటర్ల లెక్కతో సంబంధం లేకుండా ఇంధన ధరల పెంపును సాకుగా చూపిస్తూ వేలల్లో వసూలు చేస్తున్నారు.?ఫీజుల నియంత్రణ చట్టాలు కాగితాలకే పరిమితం కావడంతో కార్పొరేట్ విద్య సంస్థలు ఇష్టారాజ్యంగా ఫీజులను పెంచేస్తున్నాయి. ఎల్‌కేజీ సీటుకే లక్షల్లో డిమాండ్ చేస్తున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.?విద్య అనేది వ్యాపార వస్తువు కాదు. అది ప్రతి బిడ్డ ప్రాథమిక హక్కు. కార్పొరేట్ విద్యాసంస్థల ఈ ఫీజుల దోపిడీకి అడ్డుకట్ట వేయకపోతే, సామాన్య మరియు మధ్యతరగతి పిల్లలకు చదువు అందని ద్రాక్షగా మిగిలిపోయే ప్రమాదం ఉంది. అనేక కార్పొరేట్ పాఠశాలలు, ఇరుకైన భవనాల్లో, వాణిజ్య సముదాయాలలో నడుస్తున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో (ఉదాహరణకు అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు) బయటకు రావడానికి కనీస దారులు లేవు. సీసీటీవీ కెమెరాల నిఘా, అనుభవజ్ఞులైన సెక్యూరిటీ సిబ్బంది లేకపోవడం విద్యార్థుల భద్రతను ప్రశ్నార్థకం చేస్తోంది. విద్యా చట్టాల ప్రకారం ప్రతి విద్యా సంస్థకు ఖచ్చితంగా ఆట స్థలం ఉండాలి. కానీ, మెజారిటీ కార్పొరేట్ సంస్థలకు కనీసం నడవడానికి కూడా స్థలం ఉండటం లేదు. ఆటలు లేకపోవడం వల్ల విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. శారీరక శ్రమ లేక చిన్న వయసులోనే ఊబకాయం, కంటి సమస్యల బారిన పడుతున్నారు.?కనీస సౌకర్యాల కొరత వేల సంఖ్యలో ఉన్న విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు ఉండటం లేదు. ఉన్నా కూడా వాటి నిర్వహణ అధ్వానంగా ఉంటోంది. దీనివల్ల ముఖ్యంగా విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సురక్షితమైన తాగునీరు, గాలి, వెలుతురు సరిగ్గా రాని తరగతి గదుల్లో విద్యార్థులు మగ్గిపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కఠినమైన చట్టాలను అమలు చేస్తూ, ఫీజుల నియంత్రణ బోర్డులను బలోపేతం చేయాలని, నిబంధనలు ఉల్లంఘించే సంస్థల గుర్తింపు రద్దు చేయాలని విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

----------

# విద్యారంగంలో సమూల మార్పులకు ప్రభుత్వం కృషి





- వేములవాడలో ఆల్ఫోర్స్ నూతన పాఠశాల ప్రారంభం
- ప్రభుత్వ విద్య బలోపేతానికి కీలక చర్యలు
- విద్యార్థులకు నాణ్యమైన విద్యే లక్ష్యం
- విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, జూన్ 24 (విజన్ ఆంధ్ర):

రాష్ట్రంలో విద్యారంగాన్ని మరింత బలోపేతం చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం సమూల మార్పులకు శ్రీకారం చుడుతోందని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. బుధవారం వేములవాడ పట్టణంలో ఆల్ఫోర్స్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన పాఠశాలను విప్ ఆది శ్రీనివాస్, సంస్థ చైర్మన్ నరేందర్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు అమ్మ ఆదర్శ పాఠశాలల కార్యక్రమం ద్వారా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, ఫర్నిచర్, పరిశుభ్రత వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేసే దిశగా ఉపాధ్యాయుల నియామకాలను చేపట్టామని, నాణ్యమైన బోధన ద్వారా విద్యార్థులకు మెరుగైన అవకాశాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. గురుకుల విద్యాసంస్థల్లో విద్యార్థుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచినట్లు తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు కూడా నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. వేములవాడ నియోజకవర్గంలో విద్యారంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని, ఏటీసీతో పాటు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఢిల్లీ పబ్లిక్ స్కూల్, హైదరాబాద్ తరహాలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ వ్యవస్థను అభివృద్ధి చేసి విద్యార్థులకు ఆధునిక, పోటీ ప్రపంచానికి అనుగుణమైన విద్య అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. వేములవాడలో ఆల్ఫోర్స్ విద్యాసంస్థ ఏర్పాటు అభినందనీయమని పేర్కొన్న విప్, ప్రైవేట్ విద్యాసంస్థలు సామాజిక బాధ్యతతో పనిచేస్తూ విద్యార్థులు, తల్లిదండ్రుల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు. విద్యార్థులకు క్రమశిక్షణ, నైతిక విలువలు, ఆధునిక జ్ఞానంతో కూడిన విద్య అందించి వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, మున్సిపల్ వైస్ చైర్మన్ నరాల శేఖర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్ మధు, కౌన్సిలర్లు, ఆల్ఫోర్స్ విద్యాసంస్థల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# కరీంనగర్ జిల్లాను ప్రభుత్వ పథకాల అమలులో అగ్రభాగాన నిలపండి



- మానవీయ కోణంలో ప్రజల సమస్యలు పరిష్కరించండి
- నిత్యం ప్రజలతో మమేకం కావాలి..
- అర్హులైన వారందరికీ వివిధ అభివృద్ధి ,
- సంక్షేమ పథకాలు అందించాలి..
- ప్రజలకు సేవ చేయడం అధికారుల అదృష్టంగా భావించాలి
- సమస్యలను గుర్తించడం, పరిష్కరించడం
- నిరంతర ప్రక్రియగా కోన సాగాలి..

కరీంనగర్ (విజన్ ఆంధ్ర బ్యూరో),జూన్ 24:

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల అమలులో కరీంనగర్ జిల్లాను అగ్రభాగాన నిలపాలని రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి, జిల్లా స్పెషల్ ఆఫీసర్ సందీప్ కుమార్ సుల్తానియా అధికారులను ఆదేశించారు.బుధవారం నాడు రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి, జిల్లా స్పెషల్ ఆఫీసర్ సందీప్ కుమార్ సుల్తానియా హైదరాబాద్ నుండి నేరుగా కరీంనగర్ కలెక్టరేట్ కి చేరుకున్నారు అనంతరం కలెక్టరేట్ లో రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి, జిల్లా స్పెషల్ ఆఫీసర్ అధ్యక్షతన ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలతో మమేకమై వారి సమస్యలను గుర్తించి పరిష్కరించడమే అధికారుల ప్రధాన లక్ష్యంగా ఉండాలని అన్నారు. ప్రజలకు సేవలు అందించడం అధికారుల అదృష్టంగా బావించాలని అన్నారు. ప్రజాపాలన కార్యక్రమం ద్వారా గుర్తించిన సమస్యల పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని అన్నారు . జిల్లా యంత్రాంగం సమన్వయంతొ పని చేయాలని సమస్యల పరిష్కారం ఒక నిరంతర ప్రక్రియగా కొనసాగాలని అని అన్నారు ,రాష్ట్ర ప్రభుత్వం అనేక వినూత్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రవేశపెట్టిందని, ప్రజలకు పాలనను చేరువ చేసేందుకే ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికను అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని తెలిపారు.ప్రభుత్వ పథకాల అమలులో అధికారులు విజయవంతం చేయడమే కాకుండా , అధికారులు పథకాల సద్వినియోగం పై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. రాష్ట్ర స్థాయి లో ప్రభుత్వ పథకాల అమలు పై నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ సిబ్బందికి కూడా ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికను కరీంనగర్ జిల్లాలో విజయవంతంగా నిర్వహించిన జిల్లా యంత్రాంగాన్ని ఆయన అభినందించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, కలెక్టర్, అధికారులు సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశారని కొనియాడారు అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా కృషి చేయాలని సూచించారు. మహిళల సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు, సోలార్ పవర్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులు, అద్దె బస్సుల నిర్వహణ వంటి కార్యక్రమాల ద్వారా మహిళల ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతోందని తెలిపారు. గ్రామాలు, పట్టణాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, ఇతర మౌలిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చూడాల్సిన బాధ్యత అధికార యంత్రాంగానిదేనని స్పష్టం చేశారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుకు నిధుల కొరత లేదని, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పింఛన్లు, ఇందిరమ్మ ఇండ్లు తదితర పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

**జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా 99 రోజుల ప్రజాపాలన**

-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 6 నుంచి జూన్ 12 వరకు 10 ప్రధాన అంశాలపై జిల్లాలో కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. పరిశుభ్రత, ఫైళ్ల పరిష్కారంలో భాగంగా 4,290 ఫైళ్లు పరిష్కరించగా, 3,835 దరఖాస్తులు స్వీకరించామని, అరైవ్--అలైవ్ కార్యక్రమంలో 318 గ్రామపంచాయతీల్లో రోడ్డు భద్రత కమిటీలు ఏర్పాటు చేయడం జరిగింది అని అన్నారు . వ్యవసాయ రంగంలో 1.93 లక్షల మంది రైతులకు రూ.143.35 కోట్లు రైతు భరోసా, 206 రైతు కుటుంబాలకు రూ.14 కోట్ల రైతు బీమా అందించగా, 319 కొనుగోలు కేంద్రాల ద్వారా మూడు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రూ.554 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగింది అని అన్నారు . సంక్షేమ పథకాల కింద 45,920 కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయగా, 96,775 కొత్త సభ్యుల పేర్లు చేయడం జరిగింది అని అన్నారు . మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు రూ.334 కోట్ల ప్రయోజనం, గృహజ్యోతి ద్వారా రూ.153.10 కోట్ల లబ్ధి కల్పించామని , ఇందిరమ్మ ఇండ్ల పథకంలో 10,209 మంది లబ్ధిదారులను ఎంపిక చేయగా, 7,220 ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయి అని అన్నారు. మెగా జాబ్ మేళాలో 292 మంది యువతకు ఉద్యోగ అవకాశాలు లభించాయాని, ప్రజావాణి ద్వారా వచ్చిన 2,995 దరఖాస్తుల్లో 2,144 దరఖాస్తులు పరిష్కరించినట్లు కలెక్టర్ వివరించారు. బడిబాట కార్యక్రమం ద్వారా 9435 మంది ని



ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను చేర్పించడం జరిగింది అని అన్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో జిల్లాలో ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక విజయవంతమైందని, కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ పవర్ ప్రజెంటేషన్ విశేషంగా ఆకట్టుకుంది.పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం , నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ తో పాటు ఆయా శాఖల అధికారులు తమ తమ శాఖలకు సంబంధించి 99 రోజుల కార్యక్రమం పై ప్రజెంటేషన్ ఇచ్చారు.

----------

## నూతన కలెక్టరేట్లో పలు నిర్మాణాలకు శంకుస్థాపన

**హాజరైన ఎమ్మెల్యే, మేయర్, సుడా ఛైర్మన్**

శాతవాహన అర్బన్ డెవలప్మెంట్ కరీంనగర్ ఆధ్వర్యంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం వద్ద హెలిప్యాడ్ నిర్మాణం, సర్వీస్ రోడ్డు, హెలిప్యాడ్ కు ప్రవేశ ద్వారం ఏర్పాటు చేసేందుకు బుధవారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. 53 లక్షల రూపాయల సుడా నిధులతో చేపట్టనున్న ఈ నిర్మాణాలకు ఎమ్మెల్యే గంగుల కమలాకర్, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, కూడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా కొత్త కలెక్టరేట్ నుండి ఈశాన్యం గేట్ వరకు రహదారి అభివృద్ధి పనులు గార్డెన్ సుందరీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ రెండు పనులను కోటి ఇరవై లక్షలతో చేపట్టనున్నారు. ఈ సందర్భంగా శంకుస్థాపన కార్యక్రమానికి హాజరైన ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ నిర్ణీత కాలవ్యవధిలోగా నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కరీంనగర్ సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామని తెలిపారు. కరీంనగర్ జిల్లా వాసులకు ఇలాంటి మౌలిక వసతుల కల్పన ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. పనుల్లో ఎక్కడా నాణ్యత లోపించకుండా, పారదర్శకంగా, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనులకు ప్రజలు కూడా సహకరించాలని ఆయన కోరారు. జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఆర్టిఏ మెంబర్ పడాల రాహుల్ ఆర్ అండ్ బి ఈ నరసింహా చారి పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు

----------

## ప్రైవేట్ పాఠశాలలు బుక్ స్టాల్స్ కుమ్మక్కు..?

**తల్లిదండ్రులపై పెరుగుతున్న ఆర్థిక భారం**

ముస్తాబాద్,జూన్24( విజన్ ఆంధ్ర)

విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేయాల్సిన విద్యాసంస్థలు కొందరి వ్యాపార ప్రయోజనాలకు వేదికలుగా మారుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా కొన్ని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు నిర్దిష్ట బుక్ స్టాల్స్కు మాత్రమే పాఠ్యపుస్తకాల విక్రయ హక్కులు అప్పగిస్తున్నాయని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.దీంతో పేద, మధ్యతరగతి కుటుంబాలపై అదనపు ఆర్థిక భారం పడుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్లో తక్కువ ధరలకు లభించే పుస్తకాలను, పాఠశాలలు సూచించిన బుక్ స్టాల్స్లోనే అధిక ధరలకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొన్నట్లు చెబుతున్నారు. పుస్తకాలతో పాటు నోట్బుక్స్, ఇతర విద్యా సామగ్రిని కూడా అదే చోట కొనుగోలు చేయాలని ఒత్తిడి తీసుకువస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కొన్ని బుక్ స్టాల్స్ యాజమాన్యాలు ఇష్టానుసారంగా ధరలు నిర్ణయిస్తున్నాయనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. విద్యా సామగ్రిపై అధిక ధరలు వసూలు చేయడం వల్ల విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు.ఈ విషయమై మండల విద్యాశాఖ అధికారిని (ఎంఈఓ) సంప్రదించగా, రాతపూర్వక ఫిర్యాదులు అందిన పక్షంలో విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నట్లు సమాచారం. అయితే ముందస్తు తనిఖీలు, పర్యవేక్షణ ఎందుకు



చేపట్టడం లేదనే ప్రశ్నలు తల్లిదండ్రుల నుంచి వ్యక్తమవుతున్నాయి.పాఠశాలలు, బుక్ స్టాల్స్ మధ్య ఏవైనా వ్యాపార ఒప్పందాలు ఉన్నాయా? పుస్తకాల ధరలపై ఎందుకు నియంత్రణ లేకపోతోంది? విద్యార్థుల తల్లిదండ్రులపై పడుతున్న అదనపు భారం ఎప్పుడు తగ్గుతుంది? అనే ప్రశ్నలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి.విద్య అందరికీ అందుబాటులో ఉండాలంటే ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి ప్రైవేట్ పాఠశాలలు, బుక్ స్టాల్స్ వ్యవహారాలపై సమగ్ర విచారణ జరిపి, పుస్తకాలు మరియు విద్యా సామగ్రి ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

## ముందస్తు మొహరం వేడుకల్లో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నేత నక్క సతీష్ మాదిగ

జగిత్యాల ఆర్ సి జూన్ 24 (విజన్ ఆంధ్ర )



జగిత్యాల రూరల్ మండల పరిధిలోని జాబితాపూర్ గ్రామంలో మొహరం (పీర్ల పండుగ) వేడుకలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిం ర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా గ్రామంలో నిర్వహించిన పెద్దపుల్ల వేషాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచి భక్తులను అలరించాయి.మొహరం ఉత్సవాల సందర్భంగా గ్రామంలో పర్యటిస్తున్న ఎమ్మార్పీఎస్ నేత నక్క సతీష్ మాదిగను పెద్దపుల్ల వేషధారులు రోడ్డుపై ఆపి ఆశీర్వాదాలు, దీవెనలు అందించారు. ఈ సందర్భంగా ఆయన భక్తులతో కలిసి పండుగ వేడుకల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా నక్క సతీష్ మాదిగ మాట్లాడుతూ, మొహరం పండుగ సామరస్యానికి, సోదరభావానికి ప్రతీక అని అన్నారు. భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి గ్రామ ప్రజలందరిపై పీర్ల దీవెనలు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. గ్రామంలో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, అభివృద్ధి నెలకొనాలని కోరరు.

----------

## సర్‌కు ప్రజలు సహకరించాలి

### ఎమ్మార్వో ఎం.ఏ. పారూక్

ముస్తాబాద్,జూన్24( విజన్ ఆంధ్ర)



భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో అర్హులైన పౌరులను ఓటరు జాబితాలో చేర్చడం, అనర్హుల పేర్లను తొలగించడం, అలాగే ఓటరు వివరాలను నవీకరించడం కోసం 2026 ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ముస్తాబాద్ తహశీల్దార్, సహాయ ఎన్నికల నమోదు అధికారి ఎం.ఏ. పారూక్ తెలిపారు.ఆయన విడుదల చేసిన పత్రికా ప్రకటనలో పేర్కొన్న వివరాల ప్రకారం, ఈ కార్యక్రమంలో భాగంగా జూన్ 25, 2026 నుండి జూలై 26, 2026 వరకు బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) ఇంటింటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేయడంతో పాటు ఓటర్ల వివరాలను నమోదు చేయడంలో సహాయం చేసి, నింపిన ఫారాలను సేకరిస్తారు.బీఎల్‌వోలు ఇంటికి వచ్చిన సమయంలో ఓటర్లు పాస్‌పోర్ట్ సైజు ఫోటో, ఆధార్ కార్డు (ఐచ్ఛికం), మొబైల్ నంబర్, తల్లిదండ్రుల వివరాలు, జీవిత భాగస్వామి వివరాలు, అలాగే 2002 ఓటరు జాబితాకు సంబంధించిన సమాచారం సిద్ధంగా ఉంచాలని సూచించారు.మండలంలోని ప్రజలందరూ ఈ ప్రత్యేక సర్వే కార్యక్రమంలో చురుకుగా పాల్గొని, సరైన వివరాలను అందించి ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్వో ఎం.ఏ. పారూక్ కోరారు. ప్రజల సహకారంతో అర్హులైన ప్రతి పౌరుని పేరు ఓటరు జాబితాలో నమోదు చేయడం సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు.

----------

## ధాన్యం కుంభకోణంపై బీఆర్ఎస్ సమాధానం చెప్పాలి: కాంగ్రెస్ నేతలు

వేములవాడ, జూన్ 24 (విజన్ ఆంధ్ర):



రాజన్న సిరిసిల్ల జిల్లాలో వెలుగుచూసిన ధాన్యం కుంభకోణం విషయంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్పై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణలు నిరాధారమని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. బుధవారం వేములవాడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు.ధాన్యం అక్రమాల కేసులో అరెస్టయిన ప్రధాన నిందితుడు చేపూరి మధుకర్‌కు బీఆర్ఎస్ నాయకులతో సన్నిహిత సంబంధాలు న్నాయని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. కుంభకోణంలో భాగమైన 13 లారీలలో 10 లారీల ధాన్యాన్ని ఆయన ద్వారా విక్రయించారని, ఈ అంశంపై బీఆర్ఎస్ నాయకత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.ఈ కేసు వెలుగులోకి వచ్చిన వెంటనే విప్ ఆది శ్రీనివాస్ పోలీసు శాఖకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చి నిష్పక్షపాత విచారణ జరపాలని సూచించారని పేర్కొన్నారు. దర్యాప్తులో నిందితులుగా తేలిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని జైలుకు పంపించిన విషయాన్ని గుర్తు చేశారు.తప్పు చేసిన వారు ఎవరైనా చట్టం ముందు సమానమేనని, రాజకీయ ప్రమేయం లేకుండా విచారణ కొనసాగించాలన్నదే ప్రభుత్వ విప్ వైఖరని తెలిపారు. అయినప్పటికీ ప్రతిపక్ష పార్టీలు రాజకీయ లబ్ధి కోసం అసత్య ప్రచారాలకు పాల్పడుతున్నాయని విమర్శించారు.వేములవాడ నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా జరుగుతుండటాన్ని చూసి ఓర్వలేక కొందరు నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. రాజన్న ఆలయం అభివృద్ధి, చెరువుల పునరుద్ధరణ, సాగునీటి ప్రాజెక్టులు, రైతులకు కొనుగోలు కేంద్రాల ఏర్పాటు వంటి కార్యక్రమాలను ప్రస్తావిస్తూ ప్రభుత్వ పనితీరును సమర్థించారు.ప్రజలు వాస్తవాలను గమనిస్తున్నారని, అసత్య ప్రచారాలకు తగిన సమయంలో ప్రజలే సమాధానం చెబుతారని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు.గమనిక: పై వివరాలు కాంగ్రెస్ పార్టీ నాయకులు మీడియా సమావేశంలో చేసిన ఆరోపణలు, వ్యాఖ్యల ఆధారంగా ఇవ్వబడ్డాయి. సంబంధిత ఆరోపణలపై ఇతర పక్షాల స్పందన ఈ కథనంలో లేదు.

----------

## ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై ప్రజలకు విజ్ఞప్తి




వేములవాడ ఆర్ సి జూన్ 24 (విజన్ ఆంధ్ర)

వేములవాడ నియోజకవర్గ ప్రజలందరికీ తెలియజేయునది ఏమనగా, రేపటి నుండి అనగా 25-06-2026 తేదీ నుంచి మొదటి వారం రోజులలోగా బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు గణన పత్రాలను పంపిణీ చేయనున్నారు. కావున ప్రతి కుటుంబంలో ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరు తమ పాస్‌పోర్టు సైజు ఫోటోలను ముందుగానే ముద్రించుకొని సిద్ధంగా ఉంచుకోవాలి. బీఎల్‌వో మీ ఇంటికి వచ్చినప్పుడు గణన పత్రానికి ఫోటోను అతికించి, అవసరమైన వివరాలను నమోదు చేసి పత్రాన్ని పూర్తి చేయాలి. ఓటరు స్వయంగా పత్రాన్ని నింపలేని పక్షంలో, అవసరమైన వివరాలను బీఎల్‌వోకు తెలియజేస్తే వారు పత్రాన్ని నింపడంలో సహకరిస్తారు.పూర్తి చేసిన గణన పత్రాలను తప్పనిసరిగా 24-07-2026 తేదీలోగా సంబంధిత బీఎల్‌వోకు తిరిగి అందజేయవలసిందిగా కోరడమైనది. ఈ ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ద్వారా అర్హులైన ఏ ఒక్క ఓటరును కూడా ఓటరు జాబితా నుంచి తొలగించరు. శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు మారినవారు, మరణించినవారు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటు నమోదైనవారి పేర్లను మాత్రమే తొలగించే ప్రక్రియ చేపడతారు. ఈ విషయాన్ని ప్రతి ఓటరు గమనించగలరు. ఓటర్లు ఎటువంటి ధ్రువపత్రాల జిరాక్స్ ప్రతులు లేదా అసలు పత్రాలను సమర్పించాల్సిన అవసరం లేదు. అయితే ఎన్నికల సంఘం సూచించిన 11 రకాల ధ్రువపత్రాలలో సంబంధిత పత్రాన్ని బీఎల్‌వోకు చూపించాల్సి ఉంటుంది. ధ్రువపత్రాల ప్రదర్శనకు సంబంధించిన వివరాలు: 01-07-1987కు ముందు జన్మించిన వారు ఎన్నికల సంఘం సూచించిన 11 రకాల ధ్రువపత్రాలలో ఓటరుకు సంబంధించిన ఏదైనా ఒక ధ్రువపత్రాన్ని బీఎల్‌వోకు చూపిస్తే సరిపోతుంది. 01-07-1987 నుంచి 02-12-2004 మధ్య జన్మించిన వారు తమకు సంబంధించిన ఒక ధ్రువపత్రంతో పాటు తల్లి లేదా తండ్రిలో ఎవరికైనా సంబంధించిన ఒక ధ్రువపత్రాన్ని బీఎల్‌వోకు చూపించాల్సి ఉంటుంది.02-12-2004 తర్వాత జన్మించిన వారు తమకు సంబంధించిన ధ్రువపత్రంతో పాటు తల్లి, తండ్రి ఇద్దరికీ సంబంధించిన ధ్రువపత్రాలను బీఎల్‌వోకు చూపించాల్సి ఉంటుంది.గమనిక: ప్రతి కుటుంబంలోని ప్రతి ఓటరు పాస్‌పోర్టు సైజు ఫోటోను తప్పనిసరిగా సిద్ధంగా ఉంచుకోవాలి. ఏఈఆర్‌వో మరియు తహసీల్దార్ వేములవాడ అర్బన్ మండలం

--------

## అంగన్వాడి కేంద్రంలో అక్షరాభ్యాసం,

### స్కూల్ యూనిఫాములను పంపిణీ చేసిన గామ సర్పంచ్

అంతర్గాం, జూన్ 24 (విజన్ ఆంధ్ర):

పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం మురుమూరు గ్రామం మోడల్ అంగన్వాడి కేంద్రంలో1లో సిడిపిఓ అలేఖ్య పటేల్ఆదేశానుసారం ప్రీ స్కూల్ పిల్లలకు అక్షరాభ్యం, స్కూలు యూనిఫామ్స్ గ్రామ సర్పంచ్ మగ్గిడి స్వరూప- శ్రీనివాస్ అధ్యక్షతన అంగన్వాడి కేంద్రంలో 15 మంది ప్రీస్కూల్ పిల్లలకు అక్షరాభ్యాసం స్కూల్ యూనిఫామ్స్ ఒక్కొక్కరికి రెండు జతలు చొప్పున రాజన్న సేవా సమితి చైర్మన్ మనాలి ఠాగూర్ యూనిఫామ్స్ ను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైనటువంటి రాజన్న సేవా సమితి చైర్మన్ మనాలి ఠాగూర్ నూతనంగా అంగన్వాడి టీచర్ పెండ్యాల విమల, నూతనంగా బాధ్యతలు చేపట్టిన సునీత, పదవి విరమణ, నూతనంగా బాధ్యతలు పొందిన సందర్భంగా వారిని రాజన్న సేవా సమితి చైర్మన్ మనాలి ఠాగూర్, సర్పంచులు మగ్గిడి స్వరూప- శ్రీనివాస్, ఆంగోత్ రవికుమార్ నాయక్, కొలిపాక చంద్రారెడ్డి,మాజీ ఎంపీపీ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఉరిమెట్ల రాజలింగం, కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి డిసిసి ప్రధాన కార్యదర్శి పూదారి సత్తయ్య గౌడ్, శాలువలతో సన్మానించడం జరిగింది.ఈ సందర్భంగా రాజన్న సేవా సమితి చైర్మన్ మనాలి ఠాగూర్ మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రంలోని ప్రీస్కూల్ పిల్లలకు గత కొద్ది సంవత్సరాలుగా అంగన్వాడి అంటేనే అమ్మబడి అనే విధంగా తీర్చిదిద్దిన టీచర్ పెండ్యాల విమల పదవి విరమణ పొందడం చాలా బాధాకరమని అయినప్పటికీ పదవి విరమణ అనేది ప్రతి ఒక్కరికి తప్పదని,ఈ అంగన్వాడి కేంద్రం మళ్లీ యధావిధిగా మంచి పేరు తోటి నడవాలంటే ప్రస్తుతం వచ్చినటువంటి టీచర్ సునీత పిల్లలకు మంచి విద్యను



అందించి, క్రమ పద్ధతిలో ఉంచి తీర్చిదిద్దాలని టీచర్ సునీతకు తెలిపారు. అనంతరం ముఖ్యఅతిథిగా హాజరైన రాజన్న సేవా సమితి చైర్మన్ మనాలి ఠాగూర్ ప్రీ స్కూల్ పిల్లలకు అక్షరాభ్యాసం నేర్పించి, స్కూల్ యూనిఫార్మ్స్ అందించడం జరిగింది.అనంతరం గ్రామ సర్పంచ్ మగ్గిడి స్వరూప, పెండ్యాల విమల రాజన్న సేవా సమితి చైర్మన్ మనాలి ఠాగూర్, వివిధ గ్రామాల సర్పంచులను శాలువాలతో సన్మానించడం జరిగింది.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మగ్గిడి స్వరూప- శ్రీనివాస్, రాజన్న సేవా సమితి చైర్మన్ మనాలి ఠాగూర్, నూతనంగా అంగన్వాడి టీచర్ సునీత, పదవి విరమణ పొందిన టీచర్ పెండ్యాల విమల, పంచాయతీ కార్యదర్శి ఎస్ కమల, ఆశా వర్కర్ జ్యోతి, ప్రీ స్కూల్ కమిటీ సభ్యులు లాస్య, రవళి, భాగ్య, స్రవంతి, పద్మ, గర్భిణీలు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు

-----------

# మాదకద్రవ్యాల నిర్మూలనకు అవగాహనే ఆయుధం

### పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన

### డ్రగ్స్, గంజాయి వినియోగం చట్టరీత్యా నేరమని హెచ్చరిక



రాజన్న సిరిసిల్ల, జూన్ 24 (విజన్ ఆంధ్ర బ్యూరో):
మాదకద్రవ్యాల నిర్మూలన కోసం సమాజంలో విస్తృత అవగాహన కల్పించడం అవసరమని పోలీసులు పేర్కొన్నారు. తెలంగాణ ఈగల్ ఫోర్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యాంటీ-డ్రగ్ అవేర్‌నెస్ వీక్ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఆదేశాల మేరకు జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులు, సిబ్బంది పాల్గొని విద్యార్థులకు డ్రగ్స్, గంజాయి తదితర మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. విద్యార్థుల్లో చైతన్యం పెంపొందించే ఉద్దేశంతో చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలను కూడా నిర్వహించారు. మాదకద్రవ్యాల వ్యసనం వ్యక్తిగత జీవితానికే కాకుండా కుటుంబం, సమాజం, దేశ అభివృద్ధికి కూడా తీవ్ర హానికరమని అధికారులు వివరించారు. ముఖ్యంగా యువత, విద్యార్థులు స్నేహితుల ప్రభావం, తప్పుడు ప్రచారం లేదా కుతూహలం కారణంగా మత్తు పదార్థాల వైపు ఆకర్షితులు కాకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. గంజాయి, డ్రగ్స్ మరియు ఇతర నిషేధిత మత్తు పదార్థాల వినియోగం, రవాణా, నిల్వ, విక్రయం వంటి కార్యకలాపాలు చట్టరీత్యా నేరమని, ఇటువంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండటంతో పాటు తమ స్నేహితులు, కుటుంబ సభ్యులు, పరిసర ప్రాంతాల ప్రజలకు కూడా అవగాహన కల్పించి మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పోలీసులు పిలుపునిచ్చారు.

## సర్‌ను సద్వినియోగం చేసుకోవాలి

### తహసీల్దార్ మారుతి రెడ్డి



గంభీరావుపేట జూన్ 24 (విజన్ ఆంధ్ర)
గంభీరావుపేట మండలంలోని ప్రజలందరూ సర్ ను సద్వినియోగం చేసుకోవాలని బుధవారం తహసిల్దార్ మారుతి రెడ్డి కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన ఏ ఒక్కరీ ఓటు తీసివేయబడదు అదే విధంగా ఓటర్ ఎలాంటి ప్రూఫ్ జిరాక్స్/ఒరిజినల్ లు కూడా సమర్పించాల్సిన అవసరం లేదు అని అన్నారు.. ఎలక్షన్ కమిషన్ వారు కోరబడిన 11 రకాలు ప్రూఫ్ లలో ఓటర్ యొక్క ఏదైనా ఒక ప్రూఫ్ బి ఎల్ వో కి చూపిస్తే సరిపోతుంది కుటుంబంలో ఉండే ప్రతి యొక్క ఓటరు యొక్క ఫోటో తప్పనిసరిగా రెడీ గా ఉంచుకోవాలి అని తహసీల్దార్ మారుతి రెడ్డి తెలిపారు

--------

## గల్ఫ్ కార్మికుడి కుటుంబానిక

## రూ.58,800 ఆర్థిక సాయం.



రాయికల్, జూన్ 24 (విజన్ ఆంధ్ర):
మండలంలోని ఒడ్డెలింగాపూర్ గ్రామానికి చెందిన వడ్లూరి రాజేందర్ ఇటీవల దుబాయిలో గుండెపోటుతో మృతి చెందగా, ఆయన కుటుంబాన్ని జీడబ్ల్యూఎస్ దుబాయ్ డీఎస్పీ అధ్యక్షుడు కిరణ్‌కుమార్,తెలుగు డ్రైవర్స్ హెల్పింగ్ గ్రూప్ సభ్యులు పరామర్శించి వారి కుటుంబానికి రూ.58,800 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబానికి ప్రభుత్వం రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి అండగా నిలవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర నాయకుడు ప్రేమ్,బీసీ,ఎస్సీ,ఎస్టీ జేఏసీ నాయకులు తిరుపతి, బాబు,జీవన్,ఉపసర్పంచ్ భూక్యా శంకర్,నాయకులు రాము,లక్ష్మణ్,రాజేశం,సురేష్ పాల్గొన్నారు

--------

## కేటీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలి: కొమ్మెట రాజు హెచ్చరిక



ముస్తాబాద్,జూన్24( విజన్ ఆంధ్ర)
భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌పై మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ నాయకుడు కొమ్మెట రాజన్న తీవ్రంగా ఖండించారు. బుధవారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎన్నికల్లో ఓటమి చెందిన నిరాశతో మైనంపల్లి హనుమంతరావు ఆధారరహిత ఆరోపణలు చేస్తూ రాజకీయ మర్యాదలను విస్మరిస్తున్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై స్పష్టత లేదని ఆయన విమర్శించారు. కాళేశ్వరం, ఫోన్ నిఘా ఆరోపణలు వంటి అంశాలపై ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలను ఇప్పటివరకు నిరూపించలేకపోయిందని అన్నారు. కేటీఆర్‌పై అసభ్యకరమైన లేదా వ్యక్తిగత వ్యాఖ్యలు చేస్తే ప్రజలు సహించరని, రాజకీయ విమర్శలు హుందాగా ఉండాలని కొమ్మెట రాజన్న హెచ్చరించారు. చివరగా ఆయన తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం కేటీఆర్ నాయకత్వం అవసరమని పేర్కొంటూ తన ప్రసంగాన్ని ముగించారు.

-------

## బాల్య వివాహం చేసుకుంటే రెండేళ్ల జైలు, లక్ష జరిమానా



మల్యాల, జూన్ 24 (విజన్ ఆంధ్ర):
మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొండగట్టు పరిధిలోని గంజికుంట ఏరియాలో బాలల హక్కులు, చట్టాలపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ఆదిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా బాలల పరిరక్షణ అధికారి డి సి పి ఓ పడాల సురేష్, మల్యాల మండల ఎస్సై సందీప్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా డిసిపిఓ పడాల సురేష్ మాట్లాడుతూ.. బాల్య వివాహాల నిరోధక చట్టం-2006 ప్రకారం 18 ఏళ్ల లోపు అమ్మాయికి, 21 ఏళ్ల లోపు అబ్బాయికి పెళ్లి చేయడం చట్టరీత్యా నేరమన్నారు. చట్టాన్ని ఉల్లంఘిస్తే రెండేళ్ల కఠిన జైలు శిక్ష, లక్ష రూపాయల జరిమానా విధిస్తారని హెచ్చరించారు. . అనంతరం బాల్య వివాహాల నిరోధక పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆది రెడ్డి, ఉప సర్పంచ్ ముత్యం రెడ్డి, హెచ్ఎం రాజయ్య, జీపీ కార్యదర్శి శేఖర్, చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ కదారి శ్రావణ్, సోషల్ వర్కర్ గంగాధర్, అంగన్‌వాడీ టీచర్లు, వార్డు సభ్యులు, మహిళా సంఘాల ప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు

## అక్రమ ఇసుక రవాణాపై ఉక్కుపాదం

### టిప్పర్ పట్టివేత -- డ్రైవర్, యజమానిపై కేసు నమోదు



కథలాపూర్, జూన్ 24(విజన్ ఆంధ్ర):
మండల పరిధిలోని తక్కల్లపల్లి గ్రామ శివారులో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను రెవెన్యూ అధికారులు, పోలీసులు పట్టుకున్నారు. ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక రవాణా జరుగుతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఇసుకతో వెళ్తున్న టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని, వాహన డ్రైవర్ శ్రీకాంత్ అలాగే యజమాని మ్యాకల అంజయ్యపై కేసు నమోదు చేసినట్లు కథలాపూర్ ఎస్సై రవికిరణ్ తెలిపారు. అక్రమ ఇసుక రవాణాపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందని, నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు.

## డ్రగ్స్, సైబర్ నేరాలపై అవగాహన సదస్సు



కథలాపూర్, జూన్ 24 (విజన్ ఆంధ్ర):
మండల కేంద్రంలోని కలా దర హైస్కూల్లో స్థానిక ఎస్సై రవికిరణ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రగ్స్, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై రవికిరణ్ మాట్లాడుతూ, గంజాయి వంటి మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాల వినియోగం విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీస్తుందని, విద్య, ఉపాధి అవకాశాలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని తెలిపారు. అలాగే సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, ఆన్‌లైన్ లింకులను నమ్మి వ్యక్తిగత లేదా బ్యాంకు వివరాలు పంచుకోవద్దని హెచ్చరించారు. సైబర్ మోసాల వల్ల అనేక మంది ఆర్థిక నష్టాలకు గురవుతున్నారని, విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటూ మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ గడ్డం భూమారెడ్డి, ప్రిన్సిపాల్ కమలాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

----------

## తూర్పు, పడమరగా పెద్దమ్మ తల్లి బోనాలు



కమాన్ పూర్ జూన్ 24.(విజన్ ఆంధ్ర )
కమాన్ పూర్ మండలం జూలపల్లి గ్రామంలో ముదిరాజుల ఆరాధ్య దైవమైన పెద్దమ్మ తల్లి బోనాలు వేర్వేరుగా మంగళవారం నిర్వహించారు. జూలపల్లి గ్రామంలో పడమటి వాడలో ఒక పెద్దమ్మ గుడి ఉండగా మరొకటి తూర్పు వాడలో పెద్దమ్మ తల్లి గుడి ఉంది. గ్రామంలోని 300 మంది ముదిరాజులు వేర్వేరుగా రెండు దేవాలయాలను ఏర్పాటు చేసుకున్నారు. వర్షాకాలం ప్రారంభంలో ప్రతి సంవత్సరం ముదిరాజులు పెద్దమ్మ బోనాలు తీయడం ఆనవాయితీగా వస్తోంది. మంగళవారం ఉదయం గ్రామంలో జోగు తిరిగి బియ్యాన్ని సేకరించి ఆ బియ్యాన్ని పెద్దమ్మ తల్లులకు బోనం పెట్టి మొక్కులు మొక్కుకున్నారు. అనంతరం గ్రామంలోని ముదిరాజ్ మహిళలు తమ తమ ఇండ్ల నుండి డప్పు చప్పుళ్ల మధ్య భాజ భజన్ లీల మధ్య బోనాలను నెత్తిపై పెట్టుకుని ఊరేగింపు గా వెళ్లారు. అనంతరం పెద్దమ్మ తల్లులకు సమర్పించారు. ఈ సందర్భంగా పంటలు పండాలని, ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో ఉండాలని, అమ్మవార్ల వద్ద వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ కుల బాంధవులు భారీ ఎత్తున పాల్గొన్నారు

విజన్ ఆంధ్ర
VISION ANDHRA TELUGU DAILY

గురువారం 25 జూన్ 2026



## అనుమానిత కేసులు వెంటనే నివేదించాలి

### జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ జి. ఎంజేలా అల్ఫ్రెడ్

రాజన్న సిరిసిల్ల, జూన్ 24 (విజన్ ఆంధ్ర బ్యూరో):
మీజిల్స్, రూబెల్లా, పోలియో వంటి టీకాలతో నివారించగల వ్యాధుల నియంత్రణలో భాగంగా అనుమానిత కేసులను వెంటనే జిల్లా వైద్య ఆరోగ్యశాఖకు నివేదించాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ జి. ఎంజేలా అల్ఫ్రెడ్ సూచించారు. బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల పిల్లల వైద్య నిపుణులు, చర్మవ్యాధి నిపుణులు, ఫిజిషియన్లతో టీకా నియంత్రణ వ్యాధుల నిఘా కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పిల్లలకు సంపూర్ణ టీకాలు అందిస్తున్నప్పటికీ అప్పుడప్పుడు మీజిల్స్, రూబెల్లా అనుమానిత లక్షణాలతో కూడిన కేసులు నమోదవుతున్నాయని తెలిపారు. జ్వరం, దద్దుర్లు ఉన్న పిల్లల వివరాలు అందిన వెంటనే నమూనాలు సేకరించి పరీక్షలకు పంపిస్తామని, వ్యాధి నిర్ధారణ అయినట్లయితే సంబంధిత ప్రాంతాల్లో తక్షణ నియంత్రణ చర్యలు చేపడతామని పేర్కొన్నారు. అలాగే 15 సంవత్సరాల లోపు పిల్లల్లో శరీరంలోని ఏ భాగమైనా బలహీనపడినట్లు లేదా పక్షవాతం లక్షణాలు కనిపించినా వెంటనే సమాచారం అందించాలని కోరారు. అటువంటి కేసుల నుంచి కూడా నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు ఇచ్చిన అనంతరం ఏవైనా ఆరోగ్య సమస్యలు తలెత్తినా వాటిని అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ నెల 28న నిర్వహించనున్న జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రైవేట్ వైద్యులు భాగస్వాములు కావాలని, ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు అందేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో డీఐఓ డాక్టర్ సంపత్ కుమార్, జిల్లా డిప్యూటీ మాస్ మీడియా అధికారి ప్రసాద్, వైద్య అధికారులు, సూపర్‌వైజర్లు మరియు ప్రైవేట్ వైద్యులు పాల్గొన్నారు.

----------

## కుల సంఘ భవనాలను పూర్తి చేయాలని వినతి

కమాన్ పూర్ జూన్ 24.(విజన్ ఆంధ్ర )



రొంపి కుంటలో అసంపూర్తిగా ఉన్న కుల సంఘాల భవనాలను పూర్తి చేసేందుకు నిధులు విడుదల చేయించాలని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు మరియు మంత్రి వ్యక్తిగత సహాయకులు ఆకుల చంద్రశేఖర్ కు రొంపి కుంట వాసి కూచన మల్లయ్య వినతి పత్రాలను అందజేశారు. కమాన్ పూర్ మండలం రొంపికుంట గ్రామంలో పేండింగ్ లో వున్న గ్రామ మహిళా సమాఖ్య భవనం పద్మశాలి భవనం,యాదవ, మున్నూరు కాపు సంఘాల భవనాలు పూర్తి స్థాయిలో నిర్మించాలని మంథిని ఎం ఎల్ ఎ ,ఐటి మరియు శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు పి ఎ, చంద్రశేఖర్ ను కలిసి వినతిపత్రం ఇవ్వడం జరిగిందని పద్మశాలి సేవాసంఘం జిల్లా కార్యవర్గసభ్యులు, రొంపికుంట గ్రామశాఖ అధ్యక్షుడు కూచనమల్లయ్య మహర్షి తెలిపారు. ఈసారి వచ్చే నిధులతో పూర్తిపని జరిగేలా చూస్తామని వారు తెలిపి నందుకు మంత్రికి వారి పిఎం చంద్రశేఖర్ కు మల్లయ్య మహర్షి కృతజ్ఞ తలు తెలిపారు

---------

## పోలీసు నైపుణ్యాల పెంపునకు డ్యూటీ మీట్ ఉత్తమ వేదిక

### అదనపు ఎస్పీ చంద్రయ్య



రాజన్న సిరిసిల్ల, జూన్ 24 (విజన్ ఆంధ్ర బ్యూరో):
పోలీసు అధికారులు, సిబ్బంది విధుల్లో మరింత సమర్థవంతంగా రాణించాలంటే వృత్తిపరమైన నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకోవాలని అదనపు ఎస్పీ చంద్రయ్య అన్నారు. జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి 3వ పోలీస్ డ్యూటీ మీట్--2026 కార్యక్రమాన్ని బుధవారం అదనపు ఎస్పీ చంద్రయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నేర దర్యాప్తు, శాస్త్రీయ ఆధారాల సేకరణ, కేసుల ఛేదన, ప్రజా భద్రత పరిరక్షణ వంటి అంశాల్లో పోలీసు సిబ్బంది తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆధునిక దర్యాప్తు పద్ధతులు, ఫోరెన్సిక్ సాంకేతికతలు, నేర పరిశోధనలో అనుసరించాల్సిన ఉత్తమ విధానాలపై అవగాహన పెంచేందుకు డ్యూటీ మీట్ ఒక ఉత్తమ వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. పోలీసు అధికారులు చట్టాలపై పూర్తి అవగాహనతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. నేరస్థులను శాస్త్రీయ ఆధారాలతో న్యాయస్థానంలో దోషులుగా నిరూపించే సామర్థ్యాన్ని పెంపొందించుకోవడం అత్యంత కీలకమని అన్నారు. డ్యూటీ మీట్ ద్వారా అధికారులు, సిబ్బంది తమ అనుభవాలను పంచుకోవడంతో పాటు వినూత్న ఆలోచనలను పరస్పరం మార్పిడి చేసుకునే అవకాశం లభిస్తుందని తెలిపారు. కంప్యూటర్, ఫోరెన్సిక్ సైన్స్, ఫింగర్‌ప్రింట్స్, బాంబ్ డిస్పోజల్, డాగ్ స్క్వాడ్ ట్రాకింగ్, ఎక్స్‌ప్లోజివ్స్, యాంటీ-సబోటేజ్ చెకింగ్, ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ తదితర విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందికి జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం లభిస్తుందని, అక్కడ విజయం సాధించిన వారికి జాతీయ స్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌లో పాల్గొనే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ పోటీలు రాష్ట్రాలు, ప్రాంతాల మధ్య పోలీసు శాఖల సమన్వయం, సహకారం, వృత్తిపరమైన అనుభవాల మార్పిడికి దోహదపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐలు రవి, నాగేశ్వరరావు, రవీందర్, వెంకటేష్, ఆర్ఐ సురేష్, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు

----------

## ముదిమాణిక్యం రైతు వేదిక లో విత్తన మేళా

విజన్ ఆంధ్ర : చిగురుమామిడి



చిగురుమామిడి మండలంలోని ముదిమాణిక్యం రైతువేదికలో విత్తన మేళా నిర్వహించారు. ప్రభుత్వం ప్రతిపాదించిన బోనస్ కలిగిన మంచి వరి వంగడాల ప్రోత్సాహంలో భాగంగా రైతువేదికలో విత్తన మేళాలో వ్యవసాయ అధికారి పున్నం చందర్ రైతులకు వరి వంగడాల ప్రత్యేకతలు, అధిక దిగుబడులు సాధించే సాగు విధానాలపై వివరించారు. గ్రామ సర్పంచ్ బోయిని రమేష్ మాట్లాడుతూ రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకుని ప్రభుత్వ సూచనల మేరకు సాగు చేపట్టి అధిక లాభాలు పొందాలని సూచించారు. వ్యవసాయ విస్తరణ అధికారి అకుల ప్రణయ్ రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, విత్తనాల ఎంపిక, సరైన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ పరిధిలోని గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు

-------

## కొండగట్టు అంజన్న నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.1 లక్ష విరాళం

మల్యాల, జూన్ 24 (విజన్ ఆంధ్ర):



జగిత్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి వారి నిత్యాన్నదాన ట్రస్టుకు భారీ విరాళం అందింది. హైదరాబాద్ కూకట్‌పల్లికి చెందిన ప్రముఖ భక్తుడు శ్రీ రంగ ధ్రువన్ పొన్నాల స్వామివారి నిత్యాన్నదాన కార్యక్రమం కోసం రూ. 1,00,000 (ఒక లక్ష రూపాయలు) విరాళాన్ని అందజేశారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో ఈఓ ఎస్. అంజనారెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకుని విరాళానికి సంబంధించిన చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా దాత రంగ ధ్రువన్ పొన్నాల మాట్లాడుతూ... ఆంజనేయస్వామి వారి అనుగ్రహంతో తమ కుటుంబ సభ్యులందరూ ఆయు ఆరోగ్యాలతో, సుఖశాంతులతో ఉండాలని కోరుకుంటూ, నిత్యాన్నదాన కార్యక్రమానికి తన వంతు చిన్న సహాయంగా ఈ విరాళాన్ని అందించినట్లు తెలిపారు. అనంతరం స్వామివారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలను అందజేసి వేద ఆశీర్వచనం చేశారు. ?ఈ కార్యక్రమంలో ఆలయ సూపరెంటెంట్ సునీల్, టెంపుల్ ఇన్స్పెక్టర్ అశోక్ మరియు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు

## బూత్ లెవల్ సమగ్ర సర్వే పూర్తి చేయాలి

కమాన్ పూర్ జూన్ 24.(విజన్ ఆంధ్ర )



కమాన్ పూర్ మండలంలో బూత్ లెవెల్ అధికారులు సమగ్ర సర్వే వెంట వెంటనే పూర్తి చేయాలని తహసిల్దార్ ముస్త్యాల వాసంతి కోరారు. మంగళవారం స్థానిక తహసీల్ కార్యాలయంలో బిఎల్ఓ, జిపిఓ, మరియు గ్రామ కార్యదర్శిలకు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈనెల 25 నుండి జూలై 25 వరకు స్పెషల్ ఇన్సెంటివ్ విభజన 2026 చేసేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తహసిల్దార్ అన్నారు. ఓటర్ సమగ్ర సవరణ కొరకు ప్రతి బూత్ లెవల్ అధికారి ఇంటింటికి తిరుగుతూ ఆయా ఇండ్లలో నూతనంగా వచ్చిన ఫారం అప్పగించాలని అన్నారు. అలాగే ఆ ఇంటి యజమాని ఆ ఫారం ను నింపిన వెంటనే వాటిని ఆన్లైన్ చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం సర్ ను చేపట్టడం జరిగిందని తెలిపారు. అనంతరం పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో హెల్ప్ డెస్క్ సతీష్, స్రవంతి, శ్రీనివాస్,జిపిఓ లు కృష్ణ, రవీందర్, నాగరాజు, జ్యోతి, అశోక్ గ్రామ కార్యదర్శులు అల్లి రామ్మోహన్, జంజర్ల అమల, బచ్చల ప్రసాద్, సూది రెడ్డి ప్రవళిక, అమీనా బాను, రాము, సాయి శ్రీ, గుమ్మడి సదయ్య, ఝాన్సీ తోపాటు బిఎల్వోలు, బండ రజిత,గుమ్మడి శారద, లక్ష్మి, కృష్ణకుమారి, రేణుక, అమల, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

------

## విద్యా లక్ష్యాల సాధన కోసం కృషి చేస్తా

### ప్రిన్సిపాల్ ఎం. శిరీష



ఓదెల జూన్ 24,(విజన్ ఆంధ్ర)
తెలంగాణ మోడల్ స్కూల్ (టీజీ ఎంఎస్), ఓదెల నూతన ఎఫ్.ఏ.సి. ప్రిన్సిపాల్ గా ఎం. శిరీష బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు,బోధనేతర సిబ్బంది ఆమెకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సిబ్బంది మాట్లాడుతూ ప్రిన్సిపాల్ నాయకత్వంలో పాఠశాల విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడి,విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి పాఠశాల ముందుకు సాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శిరీష మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధి,విద్యార్థుల శ్రేయస్సు,విద్యా లక్ష్యాల సాధన కోసం సంపూర్ణ సహకారాన్ని అందిస్తానని తెలిపారు. నూతన ఎఫ్.ఏ.సి. ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎం. శిరీష తెలంగాణ మోడల్ స్కూల్,ఓదెల కుటుంబ సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

--------



## పాఠశాలలో అక్షరాభ్యాస కార్యక్రమం..

ఓదెల జూన్ 24,(విజన్ ఆంధ్ర)

పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం పిట్టల ఎల్లయ్య పల్లి గ్రామంలోని పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు సంతోష్ ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించగా ముఖ్యాథితిగా సర్పంచ్ పిట్టల రవికుమార్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా సరస్వతి పూజ చేసి అనంతరం విద్యార్థులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పిట్టల రవికుమార్,పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంతోష్,ఉపాధ్యాయురాలు సుమలత,గ్రామ కార్యదర్శి అమూల్య,ప్రీ -ప్రైమరీ బోధకురాలు పద్మ,మానస,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

----------

## ఘనంగా శ్రీ గంగా పార్వతి రాజరాజేశ్వర స్వామివార్ల కళ్యాణం

### ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది



వేములవాడ ఆర్ సి జూన్ 24 (విజన్ ఆంధ్ర)

వేములవాడ పట్టణంలోని గంగాపుత్రుల ఆధ్వర్యంలో శ్రీ గంగా పార్వతి రాజరాజేశ్వర స్వామి వార్ల కళ్యాణ మహోత్సవం బుధవారం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై స్వామి అమ్మవార్లను పట్టు వస్త్రాలు సమర్పించి దర్శించుకుని కళ్యాణంలో పాల్గొన్నారు. అర్చకుల వేదమంత్రోచ్చారణల మధ్య సంప్రదాయబద్ధంగా శ్రీ గంగా పార్వతి రాజరాజేశ్వర స్వామి వార్ల కళ్యాణ తంతు నిర్వహించారు. ఈ వేడుకకు భారీ సంఖ్యలో భక్తులు, గంగపుత్రులు తరలివచ్చి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఆలయ ప్రాంగణం అంతా భక్తులతో కిక్కిరిసిపోగా, భక్తి గీతాలు, మంగళ వాయిద్యాల నడుమ జరిగిన కళ్యాణ మహోత్సవం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. గంగపుత్రులు, స్థానిక ప్రజలు, మహిళలు విశేషంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమం అనంతరం గంగమ్మ తల్లికి బోనం సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేసి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్ ,మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, మున్సిపల్ మాజీ చైర్మన్ మాధవి-రాజు, నాయకులు వెంగళ శ్రీకాంత్ గౌడ్, కో ఆప్షన్ మెంబర్ పీర్ మహమ్మద్ , గంగపుత్ర సంఘం సొసైటీ అధ్యక్షులు పంపరి శంకర్, సంఘం అధ్యక్షులు కూర పరిశయ్య, పంపరి దేవయ్య,కూర దేవయ్య, గంగపుత్ర యూత్ అధ్యక్షులు కూర దేవేందర్, కూర బాలరాజు, పంపరి గోపాల్ , కూర లచ్చయ్య,ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

----------

## వేములవాడ గోశాలలో రైతులకు కోడెల పంపిణీ చేసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

### 100 మంది రైతులకు కోడెల అందజేతలి

### వ్యవసాయానికే కోడెలను ఉపయోగించాలి..

### దుర్వినియోగం చేస్తే చర్యలు తప్పవు

వేములవాడ టౌన్ జూన్ 24 ( విజన్ ఆంధ్ర )

వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్ గోశాలలో బుధవారం రైతులకు కోడెల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్, రాజన్న ఆలయ ఈవో రమాదేవి, మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజుతో కలిసి ఆయన రైతులకు కోడెలను అందజేశారు. ?ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, భక్తులు స్వామి వారికి భక్తిశ్రద్ధలతో సమర్పించిన నిజ కోడెలను రైతులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కోడె మొక్కులు చెల్లించే విశిష్టమైన సంస్కృతి ఒక్క వేములవాడ రాజన్న సన్నిధిలోనే ఉందని ఆయన కొనియాడారు. గోశాలలో ఉన్న కోడెల కోసం ఇప్పటికే ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న అర్హులైన రైతులను గుర్తించి, నేడు 100 మందికి వీటిని అందజేశామని చెప్పారు. భవిష్యత్తులో ఇతర జిల్లాల రైతులకు కూడా కోడెలను పంపిణీ చేస్తామని వెల్లడించారు.రైతులు తమకు అందిన కోడెలను కేవలం వ్యవసాయ పనులకు మాత్రమే ఉపయోగించాలని, వాటిని జాగ్రత్తగా సంరక్షిస్తూ ఆర్థికంగా నిలదొక్కుకోవాలని కోరారు. ఒకవేళ ఎవరైనా ఈ కోడెలను దుర్వినియోగం చేస్తే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు



తీసుకుంటామని హెచ్చరించారు. గోశాల అభివృద్ధి కోసం మర్రిపల్లిలో 40 ఎకరాల భూమిని కేటాయించామని, త్వరలోనే అక్కడ అధునాతన పద్ధతిలో సరికొత్త గోశాల నిర్మాణం చేపడతామని ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ రాకేష్, ఆర్డీఓ కె. ఎస్‌బి. కుమారి, ఆలయ ఈఓ రమాదేవి, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, తహసీల్దార్ జయంత్ కుమార్, మున్సిపల్ కమీషనర్ లోకేష్, వ్యవసాయ, రెవెన్యూ, ఆలయ అధికారులు సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

----------



## దాతల సహకారంతో అన్నదానం అన్నదాత సుఖీభవ.

### అన్నపూర్ణ స్వచ్ఛంధ సేవ సంస్థ ఆధ్వర్యంలో

### 731వ రోజు అన్నదానం..

వేములవాడ టౌన్ జూన్ 24 (విజన్ ఆంధ్ర )

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం దక్షణ కాశీగా పేరుగాంచిన వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయ ఆవరణలో నిత్యం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమంలో భాగంగా 731వ రోజు క్రీస్తు శేషులు వడ్లకొండ సంతోష్ జయంతి సందర్భంగా వారి మిత్రులు విక్కీ రాజ్, బాసాని రాజశేఖర్, గజ్జెల భూనేష్, గార్లు అందించిన సహాయంతో మరియు శాశ్వత దాతలు నాగుబోతు రవీందర్ జ్యోతి దంపతులు(భాను ఏజెన్సీస్)వారి మరియు సంవత్సర దాతలు తోట లక్ష్మి, కూరగాయల మధు మమత దంపతుల, సహకారాలతో ఈ రోజు వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ ఆవరణలో ఉన్న మరియు పట్టణ పరిసర ప్రాంతాలలో ఉన్న అన్నార్తులకు యాచకులకు భోజనం ప్యాకెట్లు అందించడం జరిగిందని అన్నపూర్ణ స్వచ్ఛంధ సేవ సంస్థ నిర్వాహకులు తోట లహరి అన్నారు, అనంతరం వారు మాట్లాడుతూ ట్రస్ట్ తరుపున నిర్వహిస్తున్న సేవ కార్యక్రమాలకు గానూ మీ వంతు సహాయ సహకారాలు అందించాలనుకునేవారు ట్రస్టు నెంబర్ 8919376459,ను సంప్రదించాల్సిశీదిగా కోరారు, ఇట్టి సేవ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు తోట లహరి రాజేష్, తదితరులు పాల్గొన్నారు

## ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

### -సర్పంచ్ పొనగంటి కుమార్.



కమాన్ పూర్ జూన్ 24.(విజన్ ఆంధ్ర )

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి అని నాగారం సర్పంచ్ పొనగంటి కుమార్ అన్నారు. మంగళవారం కమాన్ పూర్ మండలంలోని నాగారం గ్రామంలో లబ్ధిదారులకు సర్పంచ్ పోనగంటి కుమార్, ఉప సర్పంచ్ చెక్కులను శ్రీనివాసు లు చెక్కులను అందజేశారు. ఉపాధి హామీ పథకంలో పశువుల షెడ్డు నిర్మించుకున్న ఇటవేన చంద్రయ్యకు 50,580 రూపాయలు, ఇటవేన సతీష్ కు 51 వేల 760 రూపాయలు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టడం జరుగుతుందని వాటిని ప్రతి ఒక లబ్ధిదారునికి అందేలా చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యురాలు ఇటవైనా శైలజ పాల్గొన్నారు

------------

## తాళం వేసిన ఇంట్లో చోరీ బంగారం నగదు అపహరణ

మల్యాల, జూన్ 24 (విజన్ ఆంధ్ర):



మల్యాలమండల కేంద్రంలో మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్ప డ్డారు. స్థానికుల కథనం ప్రకారం.. కలువాల సత్తమ్మ అనే మహిళ తన ఇంటికి తాళం వేసి కరీంనగర్‌లోని కుమారుడి వద్దకు వెళ్లింది. ఇల్లు ఖాళీగా ఉండటాన్ని గమనించిన దొంగలు అర్ధరాత్రి లోపలికి చొరబడ్డారు. బీరువాలో ఉన్న రూ. 25 వేల నగదు, 2 తులాల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. ఉదయం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు క్లూస్ టీమ్‌తో వేలిముద్రలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు

# డిఈఓ కు సమగ్ర నివేదిక

### ప్రైవేటు పాఠశాలల దోపిడీపై సమగ్ర నివేదిక తయారుచేసి డీఈవోకు అందించిన బిఆర్ఎస్వి

కరీంనగర్ (విజన్ ఆంధ్ర) జూన్ 24.
కరీంనగర్ జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలు విద్యను సేవా దృక్పతంతో చూడకుండా ఒక వ్యాపారంగా మార్చి.. నిరుపేద విద్యార్థుల రక్తం తాగుతున్నారని మండిపడ్డారు కరీంనగర్ జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్ కుమార్ గౌడ్ గత రెండు రోజుల క్రితం డి ఈ ఓ ను కలిసి.. ప్రైవేటు పాఠశాలలో దోపిడికి సంబంధించిన సమగ్ర నివేదికను తయారుచేసి ఇస్తామని చెప్పిన మాట ప్రకారం నేడు పొన్నం అనిల్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్వి నేతలు డి ఈ ఓను కలసి ప్రైవేట్ ప్రైవేటు పాఠశాలలు అక్రమంగా నిర్వహిస్తున్న పుస్తకాలను అమ్ముతున్న గోదాముల వివరాలు, పుస్తక నిల్వలకు సంబంధించిన సమగ్ర నివేదిక తయారు చేసి వారికి అందించారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. విద్య వ్యవస్థల్లో నెలకొన్న సమస్యలు వాటిపై మీ స్పందన అనే కార్యక్రమం ద్వారా మొదటగా జిల్లాలో ప్రైవేట్ పాఠశాలల దోపిడీ ఏ విధంగా ఉంది అనే విషయాన్ని వివరించామని.. అంతేకాకుండా జిల్లా కేంద్రంలో అక్రమంగా పుస్తకాలను అమ్ముతున్న విద్యాసంస్థల వివరాలను రెండు రోజుల్లో డిఈవో కు అం దిస్తామని చెప్పిన విధంగా.. సమగ్ర నివేదికను తయారు చేసి వారికి అందించమన్నారు రెండు రోజుల్లో విద్యాశాఖ నుండి ఇలాంటి చర్యలు చేపట్టకపోతే.. బిఆర్ఎస్వి ఆధ్వర్యంలో.. ప్రైవేటు పాఠశాల పుస్తక గోదాములను ముట్టడిస్తామని హెచ్చరించారు. నాడు బి ఆర్ ఎస్ పార్టీ ప్రభుత్వ హయాంలో.. ప్రభుత్వ పాఠశాలలతో పాటు గురుకులాల్లో అన్ని వసతులు ఉండి.. విద్యార్థులు చక్కగా విద్యను అభ్యసించే వారిని కానీ ఈ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో పాఠశాలలో కనీస వసతులు లేక.. ఇటు గురుకులాలు నిర్వీర్యం అయిపోయి.. ప్రజలు ప్రైవేటు పాఠశాలలపై మొగ్గుచూపే పరిస్థితి నెలకొందని.. దీన్ని ఆసరాగా చేసుకొని ప్రైవేట్ పాఠశాలు దోపిడీకి పాల్పడుతున్నాయని



వీటిని అరికట్టాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కొంతమంది అధికారులు పాఠశాల యజమాన్యాలతో మాట్లాడుకొని.. పుస్తకాలను అక్రమంగా అమ్ముకునేందుకు ప్రత్యక్షంగా మద్దతు తెలుపుతున్నారని సమాచారం మాకు ఉందన్నారు. తల్లిదండ్రులు పిల్లలను చదివించాలంటే వారి ఆస్తులు అమ్ముకోవాల్సిన దుస్థితి ఈ ప్రభుత్వంలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.రెండు రోజుల్లో డి ఈ ఓ తగిన ఆదేశాలు... అధికారులకు ఆదేశాలు జారీ చేసి తగిన చర్యలు తీసుకోవాలని.. లేని పక్షంలో ప్రైవేట్ పాఠశాలల గోదాములను.. మీడియా ప్రతినిధుల ను పోలీస్ లకు సమాచారం ఇచ్చి మరీ ముట ట్టడిస్తామని శాంతియుతంగానే చర్యలు ఉంటాయన్నారు. ఒకవైపు సోషల్ మీడియా లో కూడ ఎప్పటికప్పుడు నిజాలు బయట ె ఎడుతామన్నారు. ఈ కార్యక్రమంలో పొన్నం అనిల్ కుమార్ గౌడ్ తో పాటు జిల్లా దీ=ూం కోఆర్డినేటర్ ద్యావ మధుసూదన్ రెడ్డి , శాతవాహన యూనివర్సిటీ ఇంచార్జ్ చుక్క శ్రీనివాస్ నగర అధ్యక్షుడు బొంకూరి మోహన్ , నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు గంగాధర చందు, పటేల్ శ్రవణ్ రెడ్డి , సోమిరెడ్డి రాజా నరేష్ రెడ్డి , వడ్లకొండ పరుశరామ్ , విక్రమ్ , అన్వేష్ , దినేష్ తదితరులు పాల్గొన్నారు




## ప్లాస్టిక్ వాడకం వద్దు - పర్యావరణం మనకు ముఖ్యం

జగిత్యాల ఆర్ సి జూన్ 24(విజన్ ఆంధ్ర )
పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి ప్రకృతిని కాపాడాలని నేత్ర స్కిన్ హాస్పిటల్ వైద్య నిపుణులు డా.హర్షిణి పెనాల, యాజమాన్యం, సిబ్బంది పిలుపునిచ్చారు. జగిత్యాలలోని నేత్ర స్కిన్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వైద్యులు, యాజమాన్యం, సిబ్బంది కలిసి బుధవారం "ప్లాస్టిక్ వాడకం వద్దు -- పర్యావరణం మనకు ముఖ్యం" అనే సందేశంతో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్లాస్టిక్ వ్యర్థాలు నేల, నీరు, గాలి కాలుష్యానికి ప్రధాన కారణమవుతున్నాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి యాజమాన్యం సంపత్ కుమార్, సుబాన్, వంశీ, సిబ్బంది అలేఖ్య, ప్రణీత, మనోజ, నరేందర్ పాల్గొని ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి తమ వంతు కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు

-----------

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిజిటల్ విద్యార్థులకు ఏఐ, డిజిటల్ లెర్నింగ్ పై శిక్షణ కార్యక్రమం



గంభీరావుపేట జూన్ 24 (విజన్ ఆంధ్ర)ద
ప్రభుత్వ డిగ్రీ మరియు పీజీ కళాశాల గంభీరావుపేటలో ప్రిన్సిపల్ ప్రొఫెసర్ వి విజయలక్ష్మి అధ్యక్షతన నోడల్ ఆఫీసర్లు డాక్టర్ జె శ్రవణ్ కుమార్, డాక్టర్ ఎన్. అదివిష్ణు, కె మహేష్ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నా అన్న అక్క మెంటర్షిప్ టీచింగ్ ఇంటర్న్షిప్ ప్రోగ్రాంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం ప్రభాకర్, డాక్టర్ వై ఆంజనేయులు పాక ధర్మపురి వి వాణి, డాక్టర్ కె వి బిక్షమయ్య, మనోహర్ శ్రీనివాస్,సుచరణ్,కృష్ణ ప్రసాద్,శంకర్ దీపిక భార్గవి పాల్గొన్నారు.

----------

## గంభీరావుపేట శ్రీరామ ట్రాక్టర్ యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నిక

గంభీరావుపేట జూన్ 24 (విజన్ ఆంధ్ర)



గంభీరావుపేట మండల కేంద్రంలో బుధవారం రోజునశ్రీరామ ట్రాక్టర్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని యూని యన్ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శ్రీరామ యూనియన్ అధ్యక్షులుగా గంద్యాడపు శంకరయ్య, ఉపా ధ్యక్షుడుమరవేని మహేష్, కోశాధికారి మాడుగుల మహేష్, సెక్రటరీ నరాని వినిత్ ,ప్రధాన కార్యదర్శులుగా టేకుమల్లా నరేష్,' మరియు ఈరవేని సత్యం, సలహదారులు గాగం ద్యాడపు రాజు, గ్యార దేవరాజులను యూనియన్ సభ్యులు కలసి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

---------

## రవీంద్రభారతిలో చిగురుమామిడి కళాకారుల ప్రదర్శన




విజన్ ఆంధ్ర :చిగురుమామిడి :
99 రోజుల ప్రజా పాలన ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రవీంద్రభారతిలో చిగురుమామిడి హుస్నాబాద్ మండలాలకు చెందిన కళాకారులు శ్రీ వీర బ్రహ్మం నాటక ప్రదర్శన చేసి వచ్చిన ప్రేక్షకులను శ్రీ అధికారులను భక్తి పరవశ్యంలో ముంచారు వీర బ్రహ్మం, కడప నవాబుల మధ్య జరిగే సన్నివేశాన్ని కళ్ళకు కట్టినట్టు వేశభూషణాలతో చాలా చక్కగా ప్రదర్శించారు వారి ప్రదర్శనను భాషా సంస్కృతిక శాఖ డైరెక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, ఏఈఓ విజయ్ కుమార్ ప్రశంసించారు వారికి సన్మానం చేసి పాల్గొన్న కళాకారులందరికీ ప్రశంస పత్రాలతో సత్కరించారు ఈ కార్యక్రమంలో నిరుద్యోగ కళాకారుల సంఘం అధ్యక్షులు అనువోజు వెంకటేశం చిగురుమామిడి కళాకారుల మండల అధ్యక్షుడు శ్రీరామోజు రాజ్ కుమార్,పున్న రమేష్, కుతాడి కొమరయ్య, నిలిగొండ కిషన్,చందబోయిన పరశురాములు, పోలోజు కుమార్ స్వామి, పిన్నింటి దాసు,మాచర్ల శ్రీను, శ్రీరామోజు రాములు, విధి మౌళి, నిలిగొండ సదానందం, పోలోజు రమేష్,సుంచు బిక్షపతి తదితరులు పాల్గొన్నారు

## సర్ ప్రక్రియపై నిశిత పరిశీలన చేయండి

### కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, బీఎల్ఏలకు కవ్వంపల్లి పిలుపు

మానకొండూరు జోన్ 24. విజన్ ఆంధ్ర



తెలంగాణ రాష్ట్రంలో గురువారం నుంచి కేంద్ర ఎన్నిక సంఘం చేపడుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను అప్రమత్తంగా ఉంటూ ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు, బూత్ స్థాయి ఏజెంట్లకు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరగాలని, ఈ ప్రక్రియలో బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) జాబితాను నిశితంగా పరిశీలించి, ఎలాంటి అవకతవకలు జరగకుండా చూడాలని సూచించారు. ఓటర్ల జాబితా సవరణ సందర్భంగా కాంగ్రెస్ కార్యకర్తలు, బీఎల్ఏలు అప్రమత్తంగా ఉండి ప్రక్రియను పర్యవేక్షించాలని డాక్టర్ కవ్వంపల్లి కోరారు. బూత్ లెవల్ అధికారులు ఇంటింటికి వెళుతున్నప్పుడు బీఎల్ఏలు తప్ప కుండా వారి వెంట ఉంటూ నిశిత పరిశీలన చేయాలన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియను నిరంతరం గమనిస్తూ, ఓటర్ల వివరాల సవరణలో ఎలాంటి లోపాలు ఉన్నా లేదా అనుమానాస్పద అంశాలు కనిపించినా వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని డాక్టర్ కవ్వంపల్లి సూచించారు. ప్రతి పది పోలింగ్ కేంద్రాలకు ఒక ఇంచార్జీని నియమించి పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించాలని, సర్ పై అన్ని గ్రామాల్లో డప్పు చాటింపు వేయించి ప్రజలను అప్రమత్తం చేయాలని ఆయన కోరారు

---------



## మానకొండూర్ ను
## 'మాదకద్రవ్య రహిత మండలం'గా మారుద్దాం

మానకొండూరు,(విజన్ ఆంధ్ర)జూన్ 24:
యువతను, విద్యార్థులను మాదకద్రవ్యాల మహమ్మారి నుండి రక్షించి, ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించే లక్ష్యంతో మానకొండూరు మండలంలోని ఊటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం ఘనంగా జరిగింది. భారత ప్రభుత్వం చేపట్టిన "నషా ముక్త్ భారత్ అభియాన్" (వ్యసన రహిత భారత్) వారోత్సవాలలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ప్రస్తుత కాలంలో సామాజిక మాధ్యమాల ప్రభావం వల్ల మాదకద్రవ్యాల వినియోగం పట్ల ఆకర్షితులయ్యే ప్రమాదం పెరిగిందని వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. ఆధునిక సాంకేతికతను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలే తప్ప, వ్యసనాలకు బానిస కావద్దని సూచించారు. మాదకద్రవ్యాల వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా, విద్యార్థుల బంగారు భవిష్యత్తుఅంధకారమవుతుందని హెచ్చరించారు. జూన్ 17 నుండి 26 వరకు జరుగుతున్న ఈ అవగాహన వారోత్సవాల్లో భాగంగా, విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై పూర్తిస్థాయి వివరణ ఇచ్చారు. మాదకద్రవ్య రహిత మానకొండూర్" లక్ష్యంగా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ప్రతిజ్ఞ చేశారు.వ్యసనాలకు దూరంగా ఉంటూ, క్రీడలు, చదువుపై దృష్టి పెట్టాలని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.
ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు రమాదేవి, మిషన్ వాత్సల్య ప్రతినిధి సాదినేని రమేష్, పాఠశాల ఉపాధ్యాయ బృందం మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులందరూ వ్యసనాలకు వ్యతిరేకంగా పోరాడతామని, సమాజంలో చైతన్యం తీసుకువస్తామని ప్రతిజ్ఞ చేశారు

----------

## అభివృద్ధి పనులు ప్రారంభించిన సర్పంచ్
### మేకల మహేశ్వరి ప్రభాకర్ యాదవ్



రామడుగు(విజన్ ఆంధ్ర) జూన్ 24:
మండలంలోని కొరటపెల్లి గ్రామంలో పలు అభివృద్ధి పనులను గ్రామ సర్పంచ్ మేకల మహేశ్వరి ప్రభాకర్ యాదవ్ ప్రారంభించారు.ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ మాట్లాడుతూ చీ+=ా నిధుల ద్వారా గ్రామ అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయడం పట్ల కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కి గ్రామ ప్రజల తరుపున కృతజ్ఞతలు తెలిపారు.గ్రామ అభివృద్ధి కోసం 10 లక్షల రూపాయల నిధులు తెచ్చి అభివృద్ధి కార్యక్రమాలు చేయడం పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. గ్రామము అభివృద్ధి కోసం అనేక నిధులు తెచ్చి గ్రామంన్నీ అభివృద్ధి చేస్తామని,గ్రామ అభివృద్ధి కోసమే మేము కష్టపడుతామని గ్రామాన్ని జాతీయ స్థాయిలో ఉత్తమ గ్రామ పంచాయితీ గా పేరు తీసుకరవడమే లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు.గ్రామంలో ఏ సమస్య ఉన్న మా దృష్టికి తీసుకరవలని,వాటిని పరిష్కరించే విధంగా పనులు చేపడుతామని హామీ ఇచ్చారు.చీ+=ా నిధుల కేటాయింపు పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పాలకవర్గం, గ్రామస్తులు మరయు యువకులు తదితరులు పాల్గొన్నారు

----------

## 'డ్రైనేజీల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు వేయకండి
### వర్షాలొస్తే డ్రైనేజీ వ్యవస్థతో
### ముప్పు తలెత్తే ప్రమాదం ఉంది..
### కార్పొరేటర్ బోయినపల్లి ప్రవీణ్ రావు



కరీంనగర్ (విజన్ ఆంధ్ర) జూన్ 24
కరీంనగర్ పట్టణ ప్రజలు, ముఖ్యంగా 50వ డివిజన్ (జ్యోతి నగర్) వాసులు , డ్రైనేజీలలో ప్లాస్టిక్ వ్యర్థాలను పడేయడం మానుకోవాలని 50వ డివిజన్ కార్పొరేటర్ బోయినపల్లి ప్రవీణ్ రావు విజ్ఞప్తి చేశారు. ప్లాస్టిక్ వ్యర్థాల ను డ్రైనేజీల్లో వేయడం వల్ల పూర్తి గా డ్రైనేజీ వ్యవస్థ స్తంభించిపోతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గత మూడు రోజుల్లో జ్యోతి నగర్ డ్రైనేజీల నుండి ఇప్పటివరకు 5 ట్రాక్టర్ల చెత్తాచెదారం ను తొలగించడం జరిగిందన్నారు.వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో డ్రైనేజీ వ్యవస్థను శుభ్రం చేసే పనులను ముమ్మరం చేసినట్లు కార్పొరేటర్ ప్రవీణ్ రావు తెలిపారు. ఈ క్రమంలో జ్యోతి నగర్, కెమిస్ట్రీ భవన్ రోడ్డు,పరిసర ప్రాంతాల్లోని డ్రైనేజీలను పరిశీలించగా, ప్లాస్టిక్ వ్యర్థాలతో , చెత్తా చెదారంతో నీరు ప్రవహించకుండా పూర్తిగా అడ్డుపడిందనే విషయాన్ని గుర్తించి, ప్రధానంగా డ్రైనేజీల్లో భారీ ఎత్తున పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించాల్సి వస్తుందన్నారు . ముఖ్యంగా ఇక్కడి ప్రాంతంలోనీ డ్రైనేజీల్లో ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోవడంతో, వర్షాలు కురిసినప్పుడు మురుగునీరు రోడ్ల మీదికి వచ్చే ప్రమాదం ఉందన్నారు.. డ్రైనేజీలలో పేరుకుపోయిన ఈ చెత్త , వ్యర్థాల వల్ల క్రిమి కీటకాలు దోమలు పెరిగి ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లే అవకాశం ఉందని, అపరిశుభ్రమైన వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు."డ్రైనేజీలలో ప్లాస్టిక్ వ్యర్థాలను వేయడం వల్ల తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందని, అపరిశుభ్రత వల్ల వచ్చే రోగాలు మన కుటుంబాలనే ఇబ్బంది పెడతాయన్నారు. . దయచేసి ప్రజలంతా బాధ్యతగా వ్యవహరించాలనీ, చెత్తను డ్రైనేజీలలో వేయకుండా, మున్సిపాలిటీ కేటాయించిన స్థలంలో(డస్ట్ బిన్) వేయాలని, చెత్త చెదారం ను ట్రాక్టర్లకు అందించాలని, పరిశుభ్రమైన పరిసరాలు, వాతావరణం కోసం సౌకర్యవంతమైన జీవనానికి డివిజన్ ప్రజలు తమ వంతుగా సహాయ సహకారాలు అందించాలని కార్పొరేటర్ ప్రవీణ్ రావు కోరారు.



## జర్నలిస్టు పిల్లలకు
## ఉచిత విద్య ఇవ్వాలని కలెక్టర్ కు వినతి
### బీసీ సంక్షేమ అనుబంధ సంఘ నాయకులు

కరీంనగర్ (విజన్ ఆంధ్ర) జూన్ 24..
జర్నలిస్టు పిల్లలకు ఫీజు రాయితీని ప్రైవేట్ పాఠశాలలు ఇవ్వడం లేదు వెంటనే 100% రాయితీలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఈరోజు బీసీ సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ గారిని కలవడం జరిగింది ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు దొగ్గలి శ్రీధర్ , బీసీ యువజన సంఘం నాయకులు మాదాసు , సంజీవ్ , బీసీ విద్యార్థి సంఘం నాయకులు కుటుంబ ఆదర్శ్ కలిశారు ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ ప్రభుత్వం జర్నలిస్టుల పిల్లలకు పూర్తి ఉచిత విద్యను అందించాలని ఆదేశాలు జారీ చేయగా దానికి అనుగుణంగా జిల్లా విద్యాశాఖ అధికారి ఉత్తర్వులు ఇయ్యగా ప్రైవేట్ పాఠశాలలు పూర్తిస్థాయిలో ఫీజు మాఫీ చేయడం సాధ్యం కాదని 10 నుండి 20% మాత్రమే మాఫీ చేస్తామని చెప్పడం జరిగింది సమాజానికి ఉపయోగపడే జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య ఎంతైనా అవసరం ఉంది కావున పూర్తిస్థాయి ఫీజులు మాఫీ చేసే విధంగా తమరు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ గారిని కోరడం జరిగింది.

---------

## మద్యపానం, మాదకద్రవ్యాలకు
## దూరంగా ఉండాలి
### భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని బాధితులకు సూచించిన జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్



కరీంనగర్, జూన్ 24:
మద్యపానం, మాదకద్రవ్యాల వినియోగాన్ని పూర్తిగా మానుకుని ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం సూచించారు.కరీంనగర్ (విజన్ ఆంధ్ర బ్యూరో) జూన్ 24.కరీంనగర్ నగరంలోని అశోక్‌నగర్‌లో ఉన్న మాదకద్రవ్యాల, మద్యపాన వ్యసన విముక్తి కేంద్రాన్ని బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ సందర్శించారు.ఈ సందర్భంగా కేంద్రం నిర్వహణ, బాధితులకు అందిస్తున్న వైద్య సేవలు, పునరావాస కార్యక్రమాలపై ఆరా తీశారు. కేంద్రంలో చికిత్స పొందుతున్న బాధితులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులు, చికిత్స పురోగతిని తెలుసుకున్నారు.వైద్యుల సూచనల మేరకు చికిత్సను పూర్తిగా కొనసాగించి మద్యపానం, మాదకద్రవ్యాల వినియోగాన్ని శాశ్వతంగా మానుకోవాలని సూచించారు. మద్యం, మాదకద్రవ్యాల వ్యసనాల వల్ల వ్యక్తిగత జీవితం మాత్రమే కాకుండా కుటుంబాలు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటాయని పేర్కొన్నారు.వ్యసనాలకు దూరంగా ఉంటేనే మంచి ఆరోగ్యం, ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుందని, కుటుంబ సభ్యుల ఆశలను నెరవేర్చే దిశగా ముందుకు సాగాలని బాధితులకు ప్రోత్సాహం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సంక్షేమ అధికారి సరస్వతి, నాగేశ్వరరావు, కేంద్ర నిర్వాహకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.